
## బొడ్రాయికి ప్రత్యేక పూజలు



బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

అంబర్‌పేట, డిసెంబర్ 13 : అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల పునఃనిర్మించిన అంబర్‌పేట బొడ్రాయి(నిభిశిల)కు శుక్రవారం దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమితి వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి దోమకొండ కిశోర్, ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ పి.గిరిధర్‌గౌడ్, బొడ్రాయి పునఃనిర్మాణ కమిటీ కన్వీనర్ సి.శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కెంచె చంద్రశేఖర్, పి.మహేందర్‌గౌడ్, దడిగ జగన్, పూర్ణచందర్‌గౌడ్, ఎడ్ల శ్రీధర్‌రెడ్డి, మోర భోజరాజ్, డి. తూకారం, రాకేశ్, ఎ.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కృషి చేయాలి

కాచిగూడ,డిసెంబర్ 13: చట్టసభల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి తెలంగాణ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. శుక్రవారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం బీసీల పట్ల అనుసరిస్తున్న విధానం సరైంది కాదని, అందుకు తెలంగాణ ప్రభుత్వం స్పందించి శాసన సభలో తీర్మానం ప్రవేశపెట్టి బీసీల పక్షాన నిలబడాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు తీర్మానం ప్రవేశపెట్టి, ఏకగ్రీవంగా అమోదించి కేంద్రానికి నివేదించి, బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. బీసీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తలపెట్టిన విజయోత్సవ సభను అడ్డుకుంటాం: బీఆర్‌ఎస్వీ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా ఆ పార్టీ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి, నిరుద్యోగ విజయోత్సవ సభను అడ్డుకుంటామని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేశ్ స్పష్టం చేశారు. తక్షణమే రాష్ట్రంలో విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లుగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయలేదని మండిపడ్డారు. ప్రతి విద్యార్థికి ఇస్తానని చెప్పిన రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ పోయిందని ఎద్దేవా చేశారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్ ఏమైందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓయూలో మొత్తం 1250 మందికి గాను కేవలం 350 మంది అధ్యాపకులు ఉన్నారని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి నిరుద్యోగ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

**• ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**



మున్సిపల్ కాలనీలో సీసీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, డిసెంబర్ 13 : నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం అంబర్ పేట డివిజన్ మున్సిపల్ కాలనీలో రూ.17లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు మరమ్మతు పనులను కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నియోజవకర్గ వ్యాప్తంగా కొత్తగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీంతో పాటు మంచినీటి, డ్రైనేజీ, పార్కుల సుందరీకరణ, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు వంటి పనులు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యంగా స్థానికులను వేధిస్తున్న డ్రైనేజీ, మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. డీఈ ప్రశాంతి, ఏఈ శ్రీగంద్‌తో పాటు బస్తీవాసులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**శాంతినగర్‌లో ఎమ్మెల్యే పర్యటన**

అంబర్‌పేట : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శాంతినగర్, చర్చిలేన్, చెంచుబస్తీలలో డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం పర్యటించారు. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా బస్తీలో ఏడాది పొడవునా డ్రైనేజీ పొంగిపొర్లుతుండటాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అక్కడే ఉన్న వాటర్‌వర్క్స్ మేనేజర్ మాజిద్‌కు చెప్పి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అలాగే బస్తీలో చెత్త తరలించే ఆటోలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారని బస్తీవాసులు పేర్కొనగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం బస్తీలో తన సహకారంతో నిర్మిస్తున్న గుడిని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ చంద్రమోహన్, టి.రమేశ్, మిర్యాల శ్రీనివాస్, కెంచె మహేశ్, శ్రీహరి, డి.లక్ష్మణ్, దీప్తి, స్వామి, యాదగిరి, కోట్ల సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## ఎన్ని భాషలు నేర్చినా మాతృ భాషను మరువద్దు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేసిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 13 : ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువద్దని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షల పురస్కారాల ప్రదానోత్సవంలో అశోక్ తేజ ప్రసంగిస్తూ తెలుగు భాష అజంత భాష అని అన్నారు. తమిళులకు తమిళ భాషపై ఉన్న ప్రేమ తెలుగు వాళ్లకు తెలుగుపై లేకపోవడం బాధాకరమన్నారు. తెలుగు భాష చిరంజీవిగా ఉండిపోవాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు దైవజ్ఞశర్మ, ప్రొఫెసర్ పీవీఎల్ మాధవరావు, బి. రూప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ షేక్‌మస్తాన్, సీనియర్ జర్నలిస్టు మైనంపాటి అన్నమాచారి, వే ఫౌండేషన్ అధినేత డాక్టర్ పైడి అంకయ్య, వాఖ్యాత మోహన్‌కుమార్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ భాషలలో నిర్వహించిన పోటీలలో విజేతలైన ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినంధించారు.

## 15న దివ్యాంగులకు వైద్యశిబిరం

కాచిగూడ, డిసెంబర్ 13: ఉచిత వైద్య శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌ తంరావు విజ్ఞప్తి చేశారు. నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ(ఆదివారం)అంబర్‌పేటలోని మున్సిపాల్ గ్రౌండ్‌లో దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల వైద్య శిబిరం వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కన్వీనర్ కొల్లి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్లు ఉమా రమేశ్‌యాదవ్, వై.అమృత, ఎడవెల్లి అజయ్ కుమార్, కృష్ణగౌడ్, కన్నె రమేశ్‌యాదవ్, క్షీర్ సాగర్, రవీందర్‌గౌడ్, అరవింద్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ వర్క్స్ ఎండీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



గోషామహల్ నియోజకవర్గంలోని మంచినీరు, సీవరేజీ సమస్యలను కింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కార్యాలయంలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుల్తాన్‌బజార్ వాటర్ వర్క్స్ డీజీఎంను వెంటనే బదిలీ చేసి ఆయన స్థానంలో పని పట్ల శ్రద్ధ ఉన్న అధికారిని నియమించాలని కోరగా ఈ విషయమై ఎండీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. హిందీనగర్‌లో సీవరేజీ లైన్ పనులను ప్రారంభించాలని అదే విధంగా గౌలిగూడ ప్రాంతంలో మంచినీరు సమస్యలు లేకుండా చేయాలని కోరినట్లు ఆనంద్ కుమార్‌గౌడ్ తెలిపారు. – అబిడ్స్, డిసెంబర్ 13

## మజ్దూర్ యూనియన్ విజయోత్సవాలు



నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంగణంలో విజయోత్సవాలు జరుపుకుంటున్న కార్మికులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 13 : రైల్వే ఎన్నికలలో మజ్దూర్ యూనియన్ విజయంసాధించడంతో నాంపల్లి రైల్వే స్టేషన్ నాంపల్లి ప్రాంగణంలో శుక్రవారం హైదరాబాద్ జనరల్ బ్రాంచ్, సీఅండ్ డబ్ల్యూ బ్రాంచి సంయుక్తాధ్వర్యంలో కార్మికులు సంబురాలు జరుపుకున్నారు. సికింద్రాబాద్ డివిజన్‌లో 2,663 ఓట్ల భారీ మెజారిటీతో, అలాగే దక్షిణ మధ్య రైల్వేలో 32,507ఓట్లతో మజ్దూర్ యూనియన్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా కార్మికులు మజ్దూర్ యూనియన్ జెండాలను చేతపట్టి స్టేషన్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించి విజయోత్సవాలను జరుపుకున్నారు. హైదరాబాద్ జనరల్ బ్రాంచ్ కార్యదర్శి ఆర్.జి బరాటే, కోశాధికారి ఎ. శ్రీనివాస్, సీఅండ్‌డబ్ల్యూ కార్యదర్శి ఎ.వరప్రసాద్, చైర్మన్ ధర్మరాజు, నేతలు ఫయాజ్, సంతోష్, ప్రకాశ్, ఎ.కె సింగ్, మల్లేశం, ఇతర ఆఫీస్ బేరర్లు, వర్కింగ్ కమిటీ సభ్యులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మిఠాయిలు పంచుకున్నారు.




## పోలీస్ స్టేడియంలో ఉస్మానియా వద్దని కలెక్టర్‌కు వినతి



హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు లాల్‌సింగ్, రాకేశ్ జైస్వాల్, పలు పార్టీల నేతలు

అబిడ్స్, డిసెంబర్ 13 : గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన భవన నిర్మాణాన్ని ఆపాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కార్పొరేటర్లు కోరారు. గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌లతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖానను నిర్మిస్తే స్థానికంగా తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. ప్రజల అభీష్టం మేరకు ఉస్మానియా దవాఖానను మరో ప్రాంతంలో నిర్మించేందుకు పునరాలోచన చేయాలని కోరారు. టి. సతీశ్, కట్ల అశోక్, డి. గోపాల్‌జీ, చంద్రశేఖర్, నితిన్ నందకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా నూతన భవనాన్ని మరోచోట నిర్మించాలని సీఎంకు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

అబిడ్స్, డిసెంబర్ 13 : ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని మార్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో ఆసుపత్రి ప్రతిపాదిత స్థలాన్ని పునః పరిశీలించాలని కోరారు. గోషామహల్ నియోజకవర్గంలో బహుళ ప్రయోజనాల కోసం నియోజకవర్గంలో ఉన్న ఏకైక మైదానం గోషామహల్ మైదానం అన్నారు. ఈ మైదానం వలన యువత క్రీడలు, వివిధ కమ్యూనిటీ కార్యకలాపాలకు మాత్రమే ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు స్థానిక పోలీసులకు శిక్షణా ప్రాంతంగా యోగా వంటి ఆరోగ్య, ఫిట్‌నెస్ కార్యకలాపాలతో పాటు యువత టోర్నమెంట్‌లకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ మైదానంలో ఉస్మానియా దవాఖాన ఏర్పాటు చేస్తే తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని దవాఖాన ప్రతిపాదనను మరోచోటికి మార్చాలని నియోజకవర్గం ప్రజల తరపు అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు.

## యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి



బైరు నాగరాజుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని సంరక్షించాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలను వర్సిటీలే చేపట్టాలని అన్నారు. వర్సిటీల్లో ఎన్నో ఏళ్లుగా అధ్యాపకులను భర్తీ చేయకపోవడంతో ఖాళీల సంఖ్య పెరిగిపోయిందన్నారు. ఇంకా జాప్యం చేస్తే వర్సిటీల్లో నాణ్యమైన ఉన్నత విద్య అందించే అవకాశం ఉండదని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సుల సిలబస్‌లో మార్పులు చేయాలని అధికారులు నిర్ణయించారని గుర్తు చేశారు. అందుకే తక్షణమే వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ అధ్యాపక భర్తీని ఆయా యూనివర్సిటీలే చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 13 : ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ–హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం ఉదయం సుమారు 35 సంవత్సరాల వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా దవఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9848349544, 040–232 02 238నంబర్లలో సంప్రదించాలి.

## అనారోగ్యంతో వృద్ధుడు..

కాచిగూడ, డిసెంబర్ 13 : రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(65) బాలానగర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–2లో అనారోగ్యంగా ఉంటూ గురువారం రాత్రి మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నలుపు రంగు చొక్కా, గోధుమ రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## లాడ్జీల్లో బస..రైళ్ల లో చోరీలు

**వివరాలను వెల్లడించిన రైల్వే డీఎస్పీ**

మారేడ్‌పల్లి, డిసెంబర్ 13: లాడ్జీల్లో మకాం వేస్తూ రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4.3 తులాల బంగారు ఆభరణాలు, రూ. 19 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు సాయిఈశ్వర్‌గౌడ్, సరస్వతిలతో కలిసి రైల్వే డీఎస్పీ వివరాలను వెల్లడించారు. బీహార్, ముంగేర్ జిల్లాకు చెందిన అన్సురాజ్ (31) టీ వ్యాపారి. నిరజ్‌కుమార్ (18) కూరగాయల వ్యాపారి. అదే గ్రామ వాసి అమర్జిత్‌కుమార్ వీరు జనరల్ టికెట్లు తీసుకొని రైళ్లలో తిరుగుతూ.. చోరీలకు పాల్పడుతున్నారు. ఆగస్టు 4వ తేదీన నిందితులు ముగ్గురు మోండా మార్కెట్ బాబా క్లాసిక్ లాడ్జిలో ఉంటూ, పలు రైళ్లలో ప్రయాణికుల వద్ద నుంచి నగలు, నగదు దొంగించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న అన్సురాజ్, నిరాజ్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగ నేరం అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి రూ. 3.41 లక్షల విలువైన నగలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అమర్జీత్ కుమార్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ఇష్టారీతిగా రోడ్ల తవ్వకాలు

**• శాఖల మధ్య సమన్వయ లోపం • అక్రమ నిర్మాణాలకు అనధికార అనుమతులు**



తాళ్లగడ్డ హనుమాన్ ఆలయం ఎదుట ప్రధాన రోడ్డును తవ్వేసిన కాంట్రాక్టర్

కార్వాన్, డిసెంబర్13 : ప్రభుత్వ అధికారుల సమన్వయ లోపంతో పలువురు కాంట్రాక్టర్లు కొత్త, పాత రోడ్డు అనే తేడా లేకుండా తవ్వేస్తున్నారు. దీంతో లక్షలాది ప్రభుత్వ నిధులు వృథా కావడమే కా కుండా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాళ్లగడ్డ హనుమాన్ ఆలయ సమీపంలో ఇటీవలే అనుమతులు లే కుండా భారీ నిర్మాణాలు వెలిశాయి. అయితే వీటికి అధికారికంగా విద్యుత్, మంచినీరు, సీవరేజీ లైన్‌ల సరఫరా కోసం దొడ్డి దారిలో నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే దొడ్డి దారిలో విద్యుత్ కనెక్షన్, మంచినీటి కనెక్షన్‌లు పొందిన అక్రమ నిర్మాణదారులు అసాధ్యం కాని లైన్‌లో డ్రైనేజీ లైన్‌ను పొందడానికి ఎలాంటి అనుమతులు లేకుండానే అధికారుల అండతో రోడ్లను తవ్వేస్తున్నారు. అర్ధరాత్రి రోడ్డును తవ్వి ఇప్పటికే కొన్ని డ్రైనేజీ లైన్లు హనుమాన్ ఆలయం ఎదుట ఉన్న మ్యాన్‌హోల్‌కు కలిపారు. ఈ మ్యాన్‌హోల్ ఇప్పటికే ప్రతి వారం నిండిపోయి మురికి నీరంతా రోడ్డు పై ప్రవహిస్తుంది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు సమస్యలు ఎదురవుతున్నాయి. కాగా ఇప్పుడు తాజాగా పక్కనున్న అక్రమ నిర్మాణదారులు తమకు కావాల్సిన డ్రైనేజీ వ్యవస్థ కోసం అపసవ్య దిశలో డ్రైనేజీ పైప్‌లైన్ వేసి ఆలయం ఎదుట ఉన్న మ్యాన్‌హోల్‌కు కలిపేందుకు రోడ్డును తవ్వారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ ప్రతినిధులు రోడ్డు తవ్వకాన్ని ఆపేశారు. ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టర్‌ను అనుమతుల గురించి అడగడంతో కాంట్రాక్టర్ అక్కడ నుంచి పలాయనం చిత్తగించాడు. సంబంధిత జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులను అడిగితే తమకు తెలియదని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం పై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ఎదుట ఇప్పటికే డ్రైనేజీసమస్య ఉందని ఇప్పుడు కొత్త లైన్ తీసుకువచ్చి కలపడంతో ప్రతి రోజూ డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతున్నదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి: ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి




సదస్సుకు హాజరైన అతిథులతో నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమాజానికి అవసరమయ్యే పరిశోధనల అవసరం ప్రస్తుత కాలంలో ఎంతగానో ఉందని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్ (ఏఈజీ) స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ జియోఫిజిక్స్ విభాగంలో 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రిషియస్ మెటల్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. జియోఫిజిక్స్ విభాగం, సెంటర్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్, ఏఈజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సదస్సుకు హాజరైన ప్రముఖ జియోఫిజిస్టులను ప్రత్యక్షంగా కలిసి వారి తో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకునే అవకాశం దక్కుతుందని చెప్పారు. అంతేకాకుండా విద్యార్థులకు విద్య, పరిశోధన ప్రయత్నాలకు మార్గనిర్దేశం దొరుకుతుందన్నారు. తద్వారా వారి విద్యావిషయిక పరిజ్ఞానం పెరిగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ వీరయ్య మాట్లాడుతూ.. సదస్సు లక్ష్యాలను వివరించారు. 1974లో ఏఈజీ ప్రారంభమైందని గుర్తు చేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, వాటి నుంచి బయటపడి, స్వర్ణోత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. స్వర్ణోత్సవాలలో భాగంగా మూడు రోజుల వర్క్‌షాప్, రెండు రోజుల సమ్మేళనం, జాతీయ సద స్సు, ప్రదర్శన ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుండ ప్రభాకర్, షిజయ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కృష్ణ కుమార్ గుప్త, ఏఈజీ సెక్రెటరీ డాక్టర్ బి. నరసింహారావు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి బాబు, కోశాధికారి జవహర్, సహాయ కార్యదర్శులు అల్లిపీర, డాక్టర్ ఎంఎన్ చారి, అధ్యాపకులు డాక్టర్ ఉదయలక్ష్మి, డాక్టర్ మంజుల, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ విద్యాసాగర చారి, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ జోగు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.


## 2010 లోపు పుట్టిన పిల్లల పేర్లను నమోదు చేసుకోండి

అంబర్‌పేట, డిసెంబర్ 13 : 2010 సంవత్సరం లోపు పుట్టిన పిల్లల పేర్లను ఇప్పటి వరకు ఎవరైతే జీహెచ్‌ఎంసీ రికార్డుల్లో నమోదు చేయించలేదో వారంతా డిసెంబర్ 31 లోపు పిల్లల పేర్లను బర్త్ అండ్ డెత్ సెక్షన్‌లో నమోదు చేయించాలని జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ రిజిస్ట్రార్ డా.హేమలత తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. డిసెంబర్ 31లోపు పిల్లల పేర్లను నమోదు చేయకపోతే ఇక ముందు నమోదు చేసుకునే అవకాశం లేదన్నారు. వెంటనే మీసేవా ద్వారా పిల్లల పేర్లను నమోదు చేయించాలని చెప్పారు.

## 15న అనంత కవితాలహరి పుస్తకావిష్కరణ

కాచిగూడ,డిసెంబర్ 13: తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణశర్మ రచించిన 'అనంత కవితా లహరి' పుస్తకావిష్కరణ ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విద్యాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకుడు బడేసాబ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, హైదరాబాద్ సిటీ అడిషనల్ డీసీపీ సీపీటీసీ రాందాస్ తేజావత్, పొట్టి శ్రీరాములు తెలుగు విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, పిల్లలమర్రి రాములు, డాక్టర్ ఎన్. బాలాచారి, నాగేశ్వరం శంకరం హాజరై పుస్తకాన్ని అవిష్కరించనున్నట్లు తెలిపారు.

## మల్లేపల్లిలో అధికారుల పర్యటన



నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్ హబీబ్ నగర్, అఫ్జల్‌సాగర్ ప్రాంతాలలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు పర్యటించారు. వీరితో పాటు ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ ఇంటింటికి వెళ్లి ప్రజలతో పారిశుధ్య సమస్యలపై చర్చించారు. – మెహిదీపట్నం, డిసెంబర్ 13

## దేవాలయ పునర్నిర్మాణ కమిటీ నియామకం

చిక్కడపల్లి,డిసెంబర్ 13: వివేక్ నగర్ శ్రీఆంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటైంది. ఆలయానికి నూతన రెనోవేషన్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులను జారీ చేశారు. మొత్తం 18 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, దేవాలయం కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం సమక్షంలో కమిటీ చైర్మన్‌గా జానకీ సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. సభ్యులు జి.పద్మవతి, నిర్మల, ముక్క రామకృష్ణ, శ్యామ్ కుమార్, సరళా సీతారాణి, ఎం.లక్ష్మీనారాయణ, సుబ్బారావు, బాలకుమార్‌తోపాటు పలువురు నియమితులయ్యారు.